# రుచి

"కోడి వేపుడు చెయ్"

"చేయను."

సుందరం ఆగిపోయాడు. స్కూటరూ ఆగిపోయింది

"ఏం?"

"నాయిష్టం" అంది సుధ.

సుందరం ఖంగుతిన్నాడు.

"ఏంచేస్తావ్."

"పచ్చడి."

"ఏం పచ్చడి"

"నా యిష్టం" అనేసింది సుధ.

సుందరం మరోసారి దెబ్బతిన్నాడు.

"నీ యిష్టం."

సుందరం వెళ్ళిపోయాడు. స్కూటరూ వెళ్ళిపోయింది.

సుధ వాకిట్లోనే ఉంది

వాళ్ళ పెళ్ళయి ఆర్నెల్లయింది. ఎప్పుడూ వాళ్ళిలా మాట్లాడుకోలేదు.

సుధకు అతని ఇష్టమే తన ఇష్టం.

సుందరానికి ఆమెకోరికే తన కోరిక.

వాళ్ళకు సొంత ఇష్టాలు కోరికలు ఇంత కాలమూ లేవు.




వాళ్ళిద్దరూ క్లాసుమేట్లు. సుందరం లెక్చరరు అయ్యాడు. నేడో రేపో ఆమె కూడా లెక్చరరవుతుంది.

ఇద్దరూ తినా కుడవా ఉన్న కుటుంబాల వాళ్లే.

అందరూ వాళ్ళది ఆదర్శ వివాహం అంటారు.

తమది ఆదర్శ దాంపత్యం అనుకొంటుంది సుధ.

మా జీవితం స్వర్గం అంటాడు సుందరం.

కమ్మని అన్నం తింటుంటే నోట్లో రాయి పడ్డట్లు కలుక్కుమంది ఇవాళ వాళ్ళ వరుస.

వాళ్ళ పెళ్ళిని అందరూ హర్షించారు. అది డబ్బుప్రస్తావన లేనిపెళ్ళి. డబ్బులేని పెళ్ళి కాదు. అది ప్రేమ పెళ్ళి. అంతేకాదు పెద్దలుచేసిన పెళ్ళి.

ఆమె శాకాహారి.

అతను మాంసాహారి

ఆ నోళ్ళతో వాళ్ళేం చేయగలరు. మాట్లాడుకోగలరా? అందరూ సందేహించారు. కానీ సుందరం ఇష్టం అన్ని విధాలా అమలవుతూ వచ్చింది..

అతని ఇష్టంలోనే తన ఇష్టం చూసుకొంది సుధ.

అతని ఇష్టం అతనికంటే ముందు ఆమె అమలు చేస్తూ వచ్చింది. ఆ చేయటం త్రికరణ శుద్ధిగా చేస్తూ వచ్చింది.

తన ఇష్టం ఇబ్బడిముబ్బడిగా నెరవేరుతుంటే కోర్కెల గుర్రాలు రేసుల్లో పరుగుపెడుతున్నాయి.

అలాంటి దాంపత్యంలో సుధ నాయిష్టం అనటం, సుందరం నీ ఇష్టం అనటం విచిత్రమే.

పెళ్ళయిన మొదట్లో స్వీట్లు తినీ తినీ సుధకు మొకం మొత్తింది. తలనొప్పి వచ్చింది. వెగటు పుట్టింది.

భర్తకోసం వంట నేర్చుకొన్న సుధ. అతను ఇష్టపడి తింటుంటే కష్టపడి వండసాగింది. ఆమె వండటం సుందరం తినటం. అదే పని. మరో ధ్యాసలేదు.

ఆమె అంత రుచిగా చేస్తుంది. అతను అంత ఆబగా తింటాడు. తింటున్నకొద్దీ చేస్తుంది. చేసిన కొద్దీ తింటున్నాడు.

వంట బ్రహ్మాండంగా చేయటానికి ఆమెనిశ్చయించుకుంది. బరువు భయంకరంగా పెరగటానికి అతను నిర్ణయించుకొన్నాడు.

కాపురం పెట్టిన తొలినాళ్ళ నుంచీ వాళ్ళు, ఒకే ప్లేటులో తినేవాళ్ళు. ఒకే కంచంలో తిని, ఒకే మంచంలో పడుకొనే ఆప్తమిత్రులు వాళ్ళు.

సుధ మాటల్లో వాళ్ళది ఆదర్శ దాంపత్యం . ఇద్దరూ ఒకే ప్లేటులో అన్నం తినేవాళ్ళు. సుందరం మాంసం కూర ప్లేటులో ఆమూల కలుపుకొంటే సుధ ఆకుకూర పప్పు ఈ మూల కలుపుకొనేది.

కంచం మాట ఇలా ఉంటే మంచం మాట మరో రకంగా ఉంది.

ఆపక్క ఒకరు. ఈ పక్క ఒకరు పడుకొనేవాళ్ళు కారు.

మంచంతో వాళ్ళ వీపులు కలిసేవి కావు.

ఇద్దరూ చెరోప్లేటులో అన్నం తినటం ఆదర్శ దాంపత్యం కాదని సుధ అభిప్రాయం.

అందువల్ల భర్తతో భర్త ప్లేటులోనే అవస్థ పడసాగింది.

తను వండిన మాంసం కూర అంతరుచిగా ఉంటుందని సుందరం అతని మిత్రబృందం అంటుంటే ఎంతరుచిగా ఉంటుందోతెలుసుకోవాలని మాత్రం సుధకు ఉబలాటంగా ఉంది.

అది తీరే మార్గం లేకపోలేదు.

కోడికూర రుచి చూడకూడదు. సుందరం అడక్కపోలేదు.

చూస్తే పోలా అని సుధ అనుకోక పోలేదు.

కాని చూడలేకపోయింది అంతే.

అయితే  కాలం చూడలేకపోయింది.

ఒకరోజు వంకాయ కూర ప్లేటుతో ఈ మూల ఈమే కలుపుకొని తింటూ ఉంది.

ఆ ప్లేటులోనే ఆ మూల అతను  కోడి వేపుడుకలుపుకుతింటున్నాడు.

రెండు వాసనలు కలిసిపోయి కొత్త వాసన వస్తూ ఉంది. వాళ్ళ కంచం ఒకేసారి రెండురుచుల్ని వేరువేరుగా అనుభవిస్తూ ఉంది.

ఆ మూల వంకాయ కూర.

ఈమూల కోడి వేపుడు.

ఏం మాయ జరిగిందో తెలియదు.

ప్లేటు ఎలా ఎందుకు ఫిరాయించిందో తెలియదు.

వంకాయ ముక్కలాగా ఉన్న కోడి వేపుడు ముక్క అందులోంచి లేచి వచ్చి ఇందులో పడింది.

సుధ వంకాయ కూరే కలుపుకొంటూ ఉంది.

వంకాయ ముక్కే తింటూ ఉంది.

ఇది రుచిగా ఉంది. ఇదో కొత్త రుచి.

రుచిలో మార్పు. ఎప్పుడూ వంకాయ ఇంతరుచిగా లేదు. ఇంతగట్టిగా లేదు. ఇంత సారవంతంగా లేదు.

తింటుంటే సుధ పంటికి పని పడింది. పన్ను గట్టిపడింది.పంటి కింద గట్టిది పడింది. చిగుళ్ళకు గుచ్చుకొంటూ ఉంది.

గుచ్చుకొనే దాన్ని వేలితో తీసింది. కంటితో చూచింది. పంటికి అర్థంకానిది కంటికీ అర్థం కాలేదు.

తేరిపార చూస్తూ 'ఏమిటిది?' అంది 'ఏమో' అన్నాడు. తీరుబడిగా చూచి 'ఎముక' అన్నాడు. అని ఎగిరిపడ్డాడు.

'ఎగరొద్దు కూర్చో' అంది. అని 'ఇది నానోటికి ఎలా వచ్చింది' అని ప్రశ్నించింది.

'నేను తినలేదు' అన్నాడు 'నా నోట్లోంచి రాలేదు.' అన్నాడు. 'తెలియదు' అన్నాడు.

'ఎక్కణ్ణుంచి వచ్చింది?' రెట్టించింది

'కోడి వేపుడులోంచి'

'కోడిలో ఎక్కడ ఉంటుంది.'

'తొడ లో

'రుచిగా ఉంది' అనేసింది.

'ఉంటుంది' అని ఒప్పేసుకున్నాడు.

సుధ తింటూ ఉంది. చాలా రుచిగా ఉంది. అని చప్పరించింది. నాలుక పెదాలను చీకింది.

సుందరం నోరు తెరుచుకొంది. తినటమూ లేదు. మాట్టాడటమూ లేదు.

తన నోరు తెరుచుకొన్న సంగతి సుందరానికి తెలియదు. చూస్తున్నాడు. సుధ తిండి తీరు పరికిస్తున్నాడు.

ఆమె చీకుతూ ఉంది. నములుతూ ఉంది. మింగుతూ ఉంది.

ఆమె తల ఎత్తటం లేదు. పక్కకు చూడటం లేదు. వంచిన తల ఎత్తకుండా వాయించేస్తూ ఉంది.

కూర అయిపోయిందాకా తింటూనే ఉంది. వేపుడు లేదుకాని వంకాయ కూర ఉంది.

అంతా అయిపోయిన తరువాత సుందరం తినటం లేదని చూచింది. 'తినూ' అంది

ఏముంది? తినటానికి తనకేముంది?

ఏమీ లేకపోవటం సుధ చూచింది. చుట్టూ చూసింది. సుందరం ముఖంలోకి చూచింది. చూస్తూ సిగ్గుపడిపోయింది. అందంగా సిగ్గుపడింది. త్రేన్చుతూ సిగ్గుపడింది.

ఆమె సిగ్గు అంత అందంగా ఉంటుందని అతనికే కాదు ఆమెకూ తెలియదు.

సుందరం కడుపు నిండిపోయింది. రోజూకంటే కడుపు పిక్కటబీర్లు నిండింది.

సుధ మళ్ళీ తేన్చింది. ఆమె త్రేన్పులు అతని ఆనందానికి అవధులు చాలా తృప్తి పొందాడు.

ఆరోజు నుంచి సుందరం ఇంటికి తెచ్చే మాంసం రెట్టింపు అయింది.

ఆమె కూరలు, కోడి, రొయ్య, చేప పొట్టి ఏదైనా అద్భుతంగా వండుతుంది వడ్డిస్తుంది. వడ్డించుకొంటూ ఉంది.

వేపుడు, మసాలా మాంసం, కూరగాయల మాంసం, ఆకుకూరల మాంసం గోంగూర పొట్లికూర వండటం ఆమె ఆరితేరిపోయింది.

రకరకాల కూరలు మార్చి మార్చి ప్రతిదినం వండి పెడుతూ ఉంది. ఆమెఅద్భుతంగా వండుతుంది. అతను అమోఘంగా తింటున్నాడు. సుందరం శుభ్రంగా తింటుంటే సుధ శుచిగా రుచిగా తింటూ ఉంది.

వాళ్ళకు మరొక పని ఏదన్నా ఉందో లేదో కానీ మాంసాహారం మాత్రం నిత్యసత్యవ్రతంగా నోముగా, వేడుకగా, పండుగగా, ఉత్సవంగా, ఊరేగింపుగా ఊపిరాడకుండా వండిపెడుతూ ఉంది. తిరునాళ్ళ తిరునాళ్ళగా తింటూ వున్నాడు.

వాళ్ళ సైజులు వాళ్ళు చూసుకోవటానికి వాళ్ళకి టైం లేదు.

ఇంత సుఖంగా తింటున్న సుధకు నాలుక లాగటం మొదలుపెట్టింది. సుతారంగా వంకర్లు పోతూ ఉంది.

ఆమెకుమొదట్లో అర్థం కాలేదు.

మాంసం తినీ తినీ నాలుక తిమ్మిరెక్కింది.

తిమ్మిరి నూత్నంగా నాలుక మీద వుట్టి నృత్యం చేసింది.

నోట్లో నీరూరి, నోరు వర్షం గుడ్డ సుక్షేత్రం అయిపోయింది.

కొత్త రుచిబీజం పడింది. మొలకెత్తింది. పెరిగింది. మానయింది. అలవికాకుండా కాపుకు వచ్చింది.

అప్పుడు తెలిసింది. నాలుక టోమాటో పచ్చడి కోరుకుంటూ ఉంది.

అక్కణ్ణుంచి నాలుక తిమ్మిరితగ్గి దురద మొదలయింది.

గోక్కుంటే పోదు. కొర్కె చంపుకుందామని చూస్తే దురద మరీ పెరుగుతూ ఉంది.

అయినా భర్తకు ఇష్టమైన కూరలే చేస్తూ ఉంది. ఆ రోజు ఏం కూర చేయబోతుందో ముందుగానే యుద్ధ ప్రకటనలాగా ఎనౌన్సు చేసింది.

ఎనౌన్సుమెంటు ఆమె మర్చిపోతే సుందరం గుర్తు చేసేవాడు లేదా చెప్పేవాడు.

అలాగే ఉదయం చెప్పాడు.

అంతేకాక మామూలే. ఆపైనజరిగిందే అనుకోనిసంఘటన.

సుందరం కోడి వేపుడు చేయమని అనటం రిక్వేస్టేకాని ఆర్డరు కాదు.

ఆమె చేయననటం వద్దనే కాని ధిక్కారం కాదు తిరస్కారం కాదు.

అనుకోకుండా అలా జరిగిపోయింది. భర్త వెళ్ళిన దగ్గర్నుంచి సుధ మథనపడసాగింది. తనమీద తనకే కోపంగా ఉంది. తన ప్రవర్తన, మాట తీరుగా సరిగా లేవనుకొంది.

భర్త కోరిక తీర్చాలి. కోడి వేపుడు చేయాలి. తన ఇష్టం తీరాలి. టోమాటో పచ్చడి కావాలి. అనుకోటమే అలస్యం వేపుడు రడీ. రుచి కూడా చూడలేదు. చేతనయిన విద్య, అలవోకగా చేసి అవతల పెట్టింది.

పచ్చడి నూరటం ప్రారంభించింది. నూరుతూ ఊరుకోలేదు. ఉప్పు వేసిందగ్గర్నుంచి రుచిచూడడం మొదలుపెట్టింది. ఫైరింజన్లో లాగా నోట్లో నీళ్ళూరుతున్నాయి.

కొంచెం కొంచెం నాకటం, చీకటం, చీదటం మొదలుపెట్టిన సుధ లప్పలు లప్పలు నాకసాగింది.

నోట్లో నీళ్ళు చెలమలో ఊరినట్లు ఊరుతున్నాయి.

నోరంతా మంట.

నీళ్ళు తాగింది. మంట తగ్గలేదు.

చెక్కరనమిలింది. మంట తగ్గలేదు.

మధ్య మధ్య రుచి చూస్తూనే ఉంది. తీరా చూస్తే రోట్లో పచ్చడి తుడిచినట్లు కడిగినట్లు అయిపోయింది.

సుధ మళ్ళీ నందనాలెత్తుకొంది పనిమొదటికి వచ్చింది.

మళ్ళీ పచ్చడి పని ప్రారంభించింది.

సుందరం మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చేనరికి ఇల్లూ ఇల్లాలూ కళకళలాడుతుంటే ఆకలికి ఐశ్వర్యాన్ని ప్రసాదించి కాళ్ళకు నీళ్ళు దానం చేశాడు.

తాను కూర్చోకముందు సుధ సంసిద్ధంగాకూర్చుంది.

ఆ పక్క అన్నం వేపుడు వడ్డించి ఈ పక్క పచ్చడి వేసింది. మాట లేదు. పలుకు లేదు. అన్నం కలుపుకొంటూ ఉంది. అంతా కలుపుకొన్నదాకా సుందరం ఆమెముఖంలోకి చూస్తూ అన్నాడు.

'వేపుడు చేయనంటివే'

ముద్ద నోట్లో పెట్టుకొంటూ 'ఆఁ' 'అంది' 'తినూ' అంది 'పచ్చడి నాక్కూడా' అన్నాడు.

'సరే' అంది వేసింది.

సుందరం వేపుడు తీసి వేరే పాత్రలో వేశాడు. అన్నం అంతా పచ్చడి కలిపాడు.

సుధకు ఆశ్చర్యంగా ఉంది.

పచ్చడి మెతుకులు తింటాడా? అనుకొంది తింటున్నాడు. అన్నం తింటూనే చెప్పాడు పచ్చడి రుచిగా ఉంది. నాలుక చప్పరించాడు. ఎక్కువకారం లేదు. రొప్పాడు. రుచి బాగుంది. నీళ్ళు తాగాడు. బాగుంది.ముద్ద మీద ముద్ద మింగుతున్నాడు. నమలటం లేదు. నాలుక దశదిశలూ తాటిస్తున్నారు.

'ఏం వేసి చేశావు?'

తింటూనే ఉన్నాడు చూడడం లేదు.

సుధ బదులు చెప్పిందా, లేదా కూడా పట్టలేదు. ఆమె జవాబు కోసం కూడా చూడలేదు. తినటం ఆపలేదు. రొప్పటం ఆపలేదు. నీళ్ళు తాగటం తగ్గటం లేదు.

పచ్చడి మళ్ళీ మళ్ళీ వేసుకొన్నాడు. తింటున్నాడు. తీరుబడి లేదు.

తీరా చూస్తే పచ్చడి లేదు.

అటుచూస్తే అన్నం లేదు.

సుందరం కడుపు నిండా తిన్నాడు. కదల్లేకుండా లేచాడు. తేన్చాడు.

సుధ పచ్చడి అన్నం కలపటం వాస్తవం. తినటం అబద్ధం.

సుందరం ఆ అన్నం ఈ అన్నం అంతా సుష్టాగా మునుంపెట్టిముగించాడు.

భర్త తింటుంటే సుధ చూస్తూ ఉండిపోయింది.

ఆకలి తీరిపోయింది.

కడుపు నిండిపోయింది సంతోషంతో పరవశించిపోయింది. పసిపిల్లవాడు అన్నం తిన్నట్టు తిన్నాడు. సుందరం ఆర్నెల్ల నుంచి అన్నం ఎరుగనివాడు తిన్నట్టుగా తిన్నాడు. సుధ ఆనందానికిహద్దుల్లేవు.

సుందరం చేయి కడుక్కొన్నాడు. అన్నం లేదు. పచ్చడి లేదు. వేపుడు ఉంది. సుధకుఅక్కరలేదు. అవసరం లేని కోడివేపుడు ఉంది. కావాలనుకొన్న పచ్చడి ఆచూకీ లేకుండా అయిపోయింది. అప్పుడు చూశాడు సుందరం సుధవైపు, చేతివైపు, లేని అన్నంవైపు. అయిపోయిన పచ్చడివైపు. వస్తున్న త్రేన్పును చూశాడు. సుధ ముఖం, చేయి, నోరు, గొంతు చూశాడు. తలవంచుకున్నాడు సుందరం.ముఖం వాలిపోయింది. సారీ అనలేదు. కానీ సుందరం శరీరం అంతా సారీ అంటూ సరిగమలు పలికింది. అంత అందమైన సుందరాన్ని సుధ ఈ ఆర్నెల్లలో చూడలేదు. ఇంత రుచి అయిన అన్నాన్ని అతనీ ఆరునెలల్లో తినలేదు.

పెళ్ళయి ఆర్నెల్లు. ఆర్నెల్లలో వారు వీరవుతారు అంటారు.
ఇక్కడ వీరు వారు కాలేదు. వారు వీరు కాలేదు. ఇద్దరూ ఒకటయ్యారు.
సుందరం దృష్టిలో ఇదే అద్వైతం.
అయితే సుధ దృష్టిలో తమది ఆదర్శ దాంపత్యం.
ఆక్షణంలో పడుచువాళ్ళిద్దరూ పసివాళ్ళయ్యారు
ఆకాశంలో సూర్యుడు అలాగ్గే నిలబడిపోయాడు.